తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# త్వరలో శ్రీనివాస సేతు, మాస్టర్ ప్లాన్ రోడ్లను అందుబాటులోకి

**-భావితరాలు చెప్పుకునే విధంగా అభివృద్ధి -మేయర్ డాక్టర్ శిరీష, ఉప మేయర్ భూమన అభినయ్**

తిరుపతి కార్పొరేషన్, మార్చి 3 ప్రభాతవార్త : శ్రీనివాస సేతు మూడవ దశ నిర్మాణ పనులు రేణిగుంట రోడ్డు నుండి రామానుజ కూడలి వరకు శుక్రవారం సాయంత్రం మేయర్, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, ఆప్కాన్స్ స్వామి పరిశీలించారు. అనంతరం రేణిగుంట రోడ్డులో మాస్టర్ ప్లాన్ల రోడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ డా. శిరీష మాట్లాడుతూ శ్రీనివాస సేతు మూడవ దశ పనులు శర్వేగంగా జరుగుతున్నాయని, అతి త్వరలో అందుబాటు తీసుకువస్తున్నామని తెలియ జేసారు. నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లన్నీ ఏప్రిల్, మే నెలలో అందుబాటులోకి తీసుకువస్తామని, తిరుమల, తిరుపతికి వచ్చే యాత్రికలకు తక్కువ వ్యవధిలోనే గమ్యం చేరే విధంగా ఈ రోడ్లని అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఉప మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు మూడవ దశ నిర్మాణ పనులు రేణిగుంట రోడ్డు, తిరుచానూరు నుండి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద వరకు పనులు పూర్తి చేస్తున్నామని ఆప్కాన్స్ స్వామి వారి సిబ్బంది తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్డులును మే మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని అదే విధంగా భవిష్యత్ భావితరాలు చెప్పుకునే విధంగా మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆంజనేయులు, తమ్ముడు గణేష్, శేఖర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉదయ్ వంశీ, ఆప్కాన్స్ ప్రతినిధి స్వామి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ డా. శిరీష

## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో...

# హోరా హోరీ పోరు

**- ఒక్క స్థానం కోసం మూడు పార్టీలు ప్రయత్నం - సిట్టింగ్ స్థానంను నిలబెట్టుకోవాలని పిడిఎఫ్**

**- ప్రభుత్వ వ్యతిరేకతతో ప్రతిపక్ష తెలుగుదేశం లబ్ధికి యత్నం**

**- ఎలాగైనా గెలిచి రాష్ట్రంలో భవిష్యత్ అధికారం తమదేనని చెప్పడానికి అధికార వైకాపా యుద్ధం**

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో హోరాహోరీ పోటీ నెలకొంది. ఈ స్థానంను ఎలాగైనా కైవసం చేసుకోవాలని మూడు పార్టీలు వ్యూహ్ ప్రతివ్యూహాలను రచించి అమలు చేస్తున్నాయి. ఇప్పటికే ఈ స్థానం నుండి పిడిఎఫ్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్సీగా వుండటంతో మరోసారి తమ అభ్యర్థిని గెలిపించి ఈ స్థానంను మళ్ళీ తమ ఖాతాలో వేసుకోవాలని పిడిఎఫ్ దూకుడుగా అడుగులు వేస్తోంది. మరోవైపు ఈ నాలుగు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని పేర్కొంటున్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు తమకు మద్దతు పలుకుతారని భావిస్తోంది. ఓటర్లలో వున్న సానుకూలతను ఉపయోగించు కోవాలని ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం క్షేత్ర స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేయడంతో వీరు ఇప్పటికే రంగంలోకి దిగి తెలుగుదేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపుకు కృషి చేస్తున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో వున్న వైకాపా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొంది రాష్ట్రంలో భవిష్యత్ అధికారం తమదేనని చాటి చెప్పాలని నిర్ణయంచి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతుంది. వైకాపా ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థిగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయం కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు రంగంలోకి దిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు నియోజక వర్గాలకు పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ అధికార వైకాపా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు మాత్రం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంను కైవసం చేసు కోవాలని టార్గెట్ ఖరారు చేసుకొని అడుగులు వేస్తున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంకు సంబంది ంచి బలమైన ఉపాధ్యాయ సంఘాలు యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్‌లు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థులు బరిలో వుండటం, ఇప్పటికే ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్‌కు సిట్టింగ్ స్థానం కావడంతో ఇటు అధికార, ప్రతిపక్ష పార్టీలు పిడిఎఫ్ నుండి ఈ స్థానంను తమ ఖాతాలో వేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 3.81 లక్షల ఓట్లు వుండగా ఇందులో పురుష ఓటర్లు 2.45 లక్షలు, మహిళా ఓటర్లు 1.35 లక్షలు వున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధి ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలు వున్నాయి. చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానం పరిధిలో 54,152 ఓటర్లు వుండగా ఇందులో 25,189 పురుష ఓటర్లు, 18,960 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే తిరుపతి జిల్లా పరిధిలో మొత్తం 86,941 ఓటర్లు వుండగా ఇందులో 53,435 పురుష ఓటర్లు, 33,494 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే అన్నమయ్య జిల్లా పరిధిలో మొత్తం 23,838 ఓటర్లు వుంటే ఇందులో 15,490 పురుష ఓటర్లు, 8,345 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే బాపట్ల జిల్లా పరిధిలో మొత్తం 26,390 ఓటర్లు వుంటే అందులో 17,626 పురుష ఓటర్లు, 8,763 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే ప్రకాశం జిల్లా పరిధిలో మొత్తం 82,225 ఓటర్లు వుండగా ఇందులో 55,703 పురుష ఓటర్లు, 26,517 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు సంబంధించి మొత్తం1,07,635 ఓటర్లు వుంటే అందులో 68,423 పురుష ఓటర్లు, 39,205 మహిళా ఓటర్లు వున్నారు. మెజార్టీ ఓటర్లను కలుసుకొని ఎలాగైనా తమకు ఓటు వేసేలా వారిని ఒప్పించగలిగితే గెలుపు ఖాయం అని భావిస్తున్న అధికార వైకాపా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలు క్షేత్ర స్థాయిలో అధికార వైకాపా తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఛైర్మన్లు, నామినేటెడ్ పదవులు వున్న నేతలు, పార్టీ నాయకులను రంగంలోకి దించి తమ అభ్యర్థి విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతుంది. అలాగే ప్రతిపక్ష తెలుగుదేశం క్షేత్ర స్థాయిలో పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జీలు, పార్టీ నేతలతో పార్టీ సమావేశాలు నిర్వహించి ఎలాగైనా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంను కైవసం చేసుకోవడానికి ముమ్మరంగా కృషి చేస్తోంది. మరోవైపు ఇప్పటికే సిట్టింగ్ స్థానంలో వున్న పిడిఎఫ్ మళ్ళీ ఈ స్థానంను తమ ఖాతాలో వేసుకోవాలని నిర్ణయించి గత ఎన్నికల్లో తరహాలోనే ఎలాంటి హడావుడి లేకుండా చాపకింద నీరులా ఎన్నికల ప్రచారం నిర్వహించుకొంటూ ముందుకు సాగుతుంది.



# లాహిరి లాహిరిలో...

**పవిత్ర పుష్కరిణిలో తెప్పపై శ్రీరామచంద్రమూర్తి అభయం**



తిరుమల, మార్చి 3 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలేశుని పవిత్ర పుష్కరిణిలో శుక్రవారం సాయంత్రం వెంకన్న ఉత్సవమూర్తి సీతాలక్ష్మణసమేత ఆంజనేయ శ్రీరామచంద్ర మూర్తి అలంకారంలో తెప్పపై విహరించారు. ఐదురోజులపాటు జరిగే ఈ సాలకట్ల తెప్పోత్సవాల్లో సాయంసంధ్యవేళ శ్రీరామచంద్రమూర్తి భక్తులను కటాక్షించారు. రాత్రి 7గంటలకు తెప్పపై ఆశీనులైన ఉత్సవ మూర్తి ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ కర్పూర హారతులు అందుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ తెప్ప పుష్కరిణలో మూడు ప్రదక్షణలు చేసింది. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ రమేష్‌బాబు, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఎస్‌ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, విజిఒ గిరిధర్, బాలిరెడ్డి, సిఐ చంద్రశేఖర్, ఏవిఎస్‌ఒలు సాయిగిరిధర్, భక్తులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను...

# వెంటనే తగ్గించాలి

**-సిపిఐ, ఏఐటీయూసీల ధర్నా, ర్యాలీలు**



నిత్యవసర ధరలపై మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

గూడూరు, మార్చి 3, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఐ, ఏఐటియూసీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బీకెఎంయూ జిల్లా కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించాయన్నారు. గత ప్రభుత్వంలో 500 రూపాయలున్న వంట గ్యాస్ ధర బీజేపి ప్రభుత్వం పెంచుకుంటూ పోతోందన్నారు. గురువారం వంట గ్యాస్ ధర మరో 50 రూపాయిలు పెంచిందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి కేవలం అదానీ, అంబానీల ఆస్తులు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్యాస్ ధర పెంపు నిర్ణయం తీసుకోవడం ఎన్డీయే ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్ మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 50 రూపాయిలు గ్యాస్ ధర పెంచితే బిజేపి నాయకురాలు స్మృతి ఇరానీ రోడ్డెక్కి రచ్చ చేసిందన్నారు. ప్రస్తుతం ఆమె మంత్రిగా ఏం ఉద్ధరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. బిజేపి ప్రభుత్వం పేదల పక్షాన ఉందో కార్పొరేట్ శక్తుల పక్షాన ఉందో ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. ఏఐటియూసి నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టాక ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అవలంభిస్తోందన్నారు. వంట గ్యాస్ పై రూ.50, కమర్షియల్ గ్యాస్ పై 300 పెంచడం దారుణమన్నారు. అంతకుముందు గ్యాస్ ధరలు తగ్గించాలి, సిపిఐ జిందాబాద్ నినాదాలతో టవర్ క్లాక్ సెంటర్ దద్దరిల్లింది. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర వీధి విక్రయదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శశికుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, పట్టణ కార్యదర్శి షేక్, కాలేషా, సీవీఆర్ కుమార్, సిపిఐ చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐటీయూసీ గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, నాగేంద్ర, రమణయ్య, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు యాకోబు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్షమోదక లక్ష్మీగణపతి...

# హవనము ప్రారంభం

**-శ్రీశారదా పీఠాదీశులచే జ్యోతి ప్రజల్వన**



లక్షమోదక లక్ష్మీ గణపతి హవనము యజ్ఞంను నిర్వహిస్తున్న రుత్వికులు, అర్చకులు

కాణిపాకం, మార్చి 3 ప్రభాతవార్త: సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీస్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 3 నుండి 5 వరకు ప్రతిష్టాత్మకంగా జరుగనున్న లక్షమోదక లక్ష్మీ గణపతి హవనము మహాయజ్ఞం కార్యక్రమం శుక్రవారం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. లోక క్షేమం కోరుతూ దేశం సుభిక్షంగా వుండాలని రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కాణిపాకం ఆలయంలో లక్షమోదక లక్ష్మీ గణపతి హవనమును విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాముల వారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, రుత్వికులు మూడు రోజుల పాటు జరుగనున్న లక్షమోదక లక్ష్మీగణపతి హవనము మహాయజ్ఞం పూజలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేసి పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాముల వారి పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం, సాయంత్రం వేళల్లో లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము యజ్ఞంను నిర్వహించారు. ఈయజ్ఞాని ్ని విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ముందుగా స్వామీజీలు స్వామివారిని దర్శించుకుని అలంకార మండపంకు విచ్చేసి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భ ంగా ఉదయం యాగశాలలో రుత్వికులు, అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ గణపతిపూజ, కలశస్థాపన, యంత్రస్థాపన, మూలమస్త్ర జపము, మోదక హవనము, లఘు పూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వినియోగములు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సాయంత్రం గణపతిపూజ, మణ్టపారాధన, స్థంభావాహన, మూలమస్త్ర జపము, మోదకహవనము, లఘు పూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, వేదస్వస్థి, తీర్థ ప్రసాద వినియోగములు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు, ఆలయ అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.





లక్షమోదక లక్ష్మీ గణపతి హవనము పూజలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి

**-ఎంఎల్ఏ చెబితే తలలూపటం... తరువాత వేధించటం**

# శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ తీరే వేరబ్బా!

శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ తీరే వేరబ్బా అన్నట్లు మారింది. ముఖ్యంగా రాజీవ్‌నగర్ పరిసరాల్లో విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలంటే వినియోగదారులకు ఓ యాగం చేసినట్లే. ఇక్కడ పాఠశాలలు కానీ, మసీదులు, దేవాలయాలు కానీ 'మాకేంటి' అన్నట్లు మారింది. ఇక్కడ పని చేసే లైన్‌మ్యాన్‌లకు కనకవర్షం కురుస్తుంది. ఇక్కడ ఎవరికైనా విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి శాసనసభ్యుడు సిఫార్సు చేసినా చెప్పినపుడు తలలూపే విద్యుత్‌శాఖ అధికారులు తరువాత పోల్‌కు ఇంత అని చెల్లించా లనే నిబంధనలతో కార్యాలయం చుట్టూ లైన్‌మెన్ చుట్టూ ప్రదక్షిణలు చేయించు కుంటు న్నారు. ఈ సమస్యలు స్థానిక ఎడిఇ దృష్టికి వచ్చినా పట్టించుకోవటం లేదు. దాంతో విద్యుత్ కనెక్షన్లు కోరే వారు లైన్ మ్యాన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగి వేసారుతున్నారు.

**విఆర్ఓ ధృవీకరణ చెల్లదట:**

శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్, ఉపధ్యాయనగర్, కైలాసగిరి కాలనీ, శివనాధపురం పరిసరాల్లో ఎవరైనా విద్యుత్ కనెక్షన్లు కావాలంటే విఆర్ఓ సంతకం చేసి ధృవీకరించాలని కొంత కాలం విద్యుత్ శాఖ అమలు చేసింది. విఆర్ఓ ధృవీకరిస్తే విద్యుత్ కనెక్షన్ ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం విఆర్ఓ ధృవీకరణ చెల్లదంటూ విద్యుత్ శాఖ తిరస్కరిస్తున్నారు. దాంతో లబ్ధిదారుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. రాజీవ్‌నగర్ పరిసరాల్లో చేతిలో పట్టా ఉండి, ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడు అన్ని వివరాలు సమర్పించి తనకు విద్యుత్ కనెక్షన్ కోసం ధృవీకరించాలని విఆర్ఓ వద్దకు వెళితే ఆయన 'నాకు సంబంధం లేదని' తిరస్కరిస్తున్నారు. మరి ఎవరి వద్ద ధృవీకరించాలంటే విద్యుత్ శాఖ 'తహశీల్దార్ సర్టిఫై చేయాలని చెబుతున్నారు.

**తహశీల్దార్ విఆర్ఓ ధృవీకరణ లేకుండా సర్టిఫై చేస్తారా?**

శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో లబ్ధిదారులు గందరగోళ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గతంలో విఆర్ఓ వద్ద సర్టిఫికేట్ పొందాలంటేనే గగనంగా భావించే వారు. ప్రస్తుతం తహశీల్దార్ సర్టిఫికేట్ అంటే తల్లడిల్లుతున్నారు. విఆర్ఓ ధృవీకరించనిదే తహశీల్దార్ సంతకం పెడతారా? విద్యుత్‌శాఖ పని తీరు లబ్ధిదారులను ముప్పు తిప్పటు పెట్టె విధంగా మారింది. ఓ వైపు వినియోగదారులు అధిక బిల్లులు వస్తున్నాయంటే సమాధానం చెప్పె దిక్కులేదు. మరో వైపు కొత్తకనెక్షన్ల కోసం వెళ్ళె వారికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**ఎంఎల్ఏ ఆదేశాలు బేఖాతరు:**

సాధారణంగా స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రజలకు ... ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సమావేశాల్లో, బ... సభల్లో సూచిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఎవరైన సమస్య లున్న వారు శాసనసభ్యుని వద్దకు వెళ్ళి విన్నవిస్తే ఆయన విద్యుత్ అధికారులకు సూచిస్తున్నారు. అయితే ఆయన సూచించినపుడు తలలూపే అధికారులు తరువాత అమలు చేయటం లేదు. పైగా లబ్ధిదారులను చులకనగా చూస్తున్నారు. ఈ నేపధ్యంలో శివనాధపురంలో ఓ మసీదును నిర్మించుకున్నారు. ఆ మసీదుకు విద్యుత్ సరఫరా కోసం అక్కడి ప్రజలు తిరిగి తిరిగి విసిగి వేసారి చివరకు శాసనససభ్యునికి విన్నవించారు. ఆయన సరాసరి అధికారికి ఒకవేళ పోల్స్ అవసరమైనా వేసేయండని ఆదేశించారు. అయినా అమలు జరగకపోవటంతో ఆయన పిఏ విద్యుత్‌శాఖ అధికారులకు ఆ పని చేసి పెట్టమని అధికారులను సూచించారు. అయినా సుమారు ఏడాదిగా ఆ మసీదుకు విద్యుత్ కనెక్షన్ కోసం ఆ ప్రాంత ముస్లింలు విద్యుత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ సమస్య పరిష్కరించబడలేదు. తీరా ఈ ప్రాంతాల్లోని లైన్ మెన్ రూ.30వేలు డిమాండ్ చేసినట్లు ఆ మసీదు నిర్వాహాకులు వాపోతున్నారు. విద్యుత్ శాఖలో కొత్త కనెక్షన్లు ఆయాప్రాంతాల్లోని లైన్ మ్యాన్‌లకు 'కనక వర్షం' కురిపిస్తూ లబ్ధిదారులకు షాక్ ఇస్తున్నారు.



విద్యుత్‌శాఖ కార్యాలయం

**తహశీల్దారే రాతమూలకంగా ఇచ్చారు: ఎడిఇ**

శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ పరిసరాల్లో విద్యుత్ శాఖ అధికారులు అస్మదీయుల కనుసన్నల్లో పనిచేస్తూ నిజమైన వినియోగదారుల జీవితాలతో చెలగాట మాడుతున్న అంశాన్ని ప్రభాతవార్త గురువారం ఎడిఇ దృష్టికి తీసుకురాగా ఈ ప్రాంతాల్లో తహశీల్దారే స్వయంగా తమకు ఉత్తర్వులు ఇచ్చారు. తాను ధృవీకరిస్తేనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అందుకే తాము విఆర్ఓ సర్టిఫికేట్లను అనుమతించటం లేదని స్పష్టం చేసారు. లైన్‌మెన్ డిమాండ్‌గురించి ఆయన దృష్టికి తీసుకురాగా వారితో ఏం పని మీ సేవా లేదా సచివాలయంలో దరఖాస్తు చేయమనండి అంటూ సమాధానం ఇచ్చారు.

## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో...

# శ్రీసిటీ స్టాల్‌ను ప్రారంభించిన గడ్కరీ

**-ఇండస్ట్రీయల్, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌పై ప్యానెల్ సెషన్‌లో ప్రసంగించిన శ్రీసిటీ ఎండీ**



శ్రీసిటీ స్టాల్ ప్రారంభించిన దృశ్యం

సత్యవేడు, మార్చి 3,ప్రభాతవార్త: విశాఖపట్న ంలో శుక్రువారం ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి ప్రారంభించిన గ్లోబల్ ఇన్వేస్టర్స్ సమ్మిట్-2023కి కేంద్ర రోడ్డురవాణా, హైవే శాఖామంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఏపీకి చెందిన పలువురు మంత్రులు, సీనియర్ అధికారులు, ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీసిటీ స్టాల్‌ను ఏపి సిఎం, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో నితిన్ గడ్కరీ ప్రారంభించారు. స్టాల్‌ను తిలకించిన వారు శ్రీసిటీ విశిష్టతను ప్రశంసించారు. ఇందులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, స్కేల్‌డౌన్ 3డి మోడల్‌ల ద్వారా శ్రీసిటీ వ్యాపార నగరం ప్రత్యేకతలు, స్థాన ప్రయోజనాలు, ప్రపంచస్థాయి మౌళిక సదుపాయాలు, ఇతర అంశాలను హైలెట్ చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలచే ప్రదర్శించబడిన ఎఫ్‌ఎంసిజీ, వివిధ బ్రాండ్ల ఎయిర్ కండీషనర్లు, ఆటో మొబైల్ కాంపోనెంట్‌లు, వీల్ చైర్లు, ఇసుజు కార్లు తదితర 'మేడ్ అట్ శ్రీసిటీ ఉత్పత్తులు' సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులను విశేషంగా ఆకర్షించాయి. సదస్సు ప్రారంభించిన తరువాత ఇండస్ట్రీయల్, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగిన ప్యానెల్ చర్చలో డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి మాట్లాడారు. తన లోతైన విశ్లేషణలు, అభిప్రాయాలను పంచుకుంటూ, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి మంచి మౌళిక సదుపాయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు అందించే అనువైన వ్యాపార వాతావరణాన్ని పెట్టుబడుదారులు పరిశీలిస్తారని ఆయన అన్నారు. ఈకోవలో జగన్‌మోహన్‌రెడ్డి డైనమిక్ నాయకత్వం పెట్టుబడిదారులపై పెద్దఎత్తున ప్రభావం చూపిందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన కార్యక్రమాలు, చురుకైన విధానాలు, ప్రధాన నౌకాశ్రయాలతో కూడిన సుదీర్ఘతీరప్రాంతం, అద్భుతమైన రోడ్లు, రైలు నెట్‌వర్కులు, నాణ్యమైన శక్తి, సాంకేతికంగా నైపుణ్యం కలిగిన మానవశక్తి, గొప్ప ఖనిజ వనరులు, ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రీయల్, బిజినెస్ పార్కులతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. మల్టీమోడ్ కనెక్టివిటీని అందజేస్తూ లాజిస్టిక్స్ ధరను తగ్గించాలనే లక్ష్యంతో చేపట్టిన కేంద్ర పిఎం గతిశక్తి చొరవకు అనుగుణంగా, రాష్ట్రప్రభుత్వం ఏపి లాజిస్టిక్స్ పాలసీ 2022-2027ని తీసుకుని వచ్చినట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

సదుం,మార్చి 3 ప్రభాతవార్త :



మండల పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు వైకాపా నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటర్లను, ఉపాధ్యాయ ఓటర్లను వారి ఇళ్లకు వెళ్లి కలిశారు. కరపత్రాలు అందజేసి వైకాపా అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని వైకాపా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీలు ధనంజయరెడ్డి, అమరావతి పుట్రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి, గృహసారధుల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, కోఆప్షన్ మెంబరు ఇమ్రాన్, సీహెచ్‌సీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## సీఎం,మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

సదుం,మార్చి 3 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కృషి చేస్తోందని వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవనంలో వైకాపా ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పలువురు దళితులకు వైకాపా ప్రభుత్వంలో పదవులు రావడం చెప్పుకోదగ్గ పరిణామం అన్నారు. అదేవిధంగా అంబేద్కర్ స్ఫూర్తితో పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, అంబేద్కర్ యువజన సంఘం గౌరవాధ్యక్షుడు సీతాపతి, మండల అంబేద్కర్ సంఘం కార్యదర్శి హరిబాబు, జోగివారిపల్లె రమేష్, పులిచెర్ల మండల డప్పుకళాకారుల సంఘం అధ్యక్షుడు సురేంద్ర, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తితిదే సహకారంతో ఉత్సవ విగ్రహాలు

**సదుం, మార్చి 3 ప్రభాతవార్త :** సదుం పంచాయతీ కొత్తపల్లెలోని శ్రీవారి పాదక్షేత్రంలో వెలసిన వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తితిదే ఆధ్వర్యంలో కొత్త ఉత్సవ విగ్రహాలు అందజేశారు. అనంతరంవిగ్రహాలకుప్రత్యేకపూజలుచేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

## ప్రవేటు స్కూల్‌లో విద్యార్థి అదృశ్యం!

-పోలీసులకు ఫిర్యాదు, ఇంటికి చేరిన విద్యార్థి

**వెదురుకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త :** మండలంలోని దేవళంపేట ఓ ఇంగ్లీషు మీడియం ప్రవేటు స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యంపై పాఠశాల కరస్పాండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. మండలంలోని తిరుమలయ్యపల్లెకు చెందని పోస్టుమాన్ రామచంద్రుడు కుమారుడు రెడ్డిదేవేంద్ర ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. పదవ తరగతి కావడంతో పరీక్షలు దగ్గరపడుతుండటంతో అదనపు శిక్షణ కొరకు రాత్రి ప్రత్యేక తరగ తులు నిర్వహించడంతో విద్యార్థి ప్రతి రోజులానే వెళ్ళడం జరిగింది. కాగా తెల్లవారుజామున 4 గంటల ప్రాంతం నుంచి విద్యార్థి కన్పించకపోవడంతో సమస్య మొదలైయింది. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం చేరవేయడంతో రెడ్డిదేవేంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఏమి జరిగిందో అర్థకాని పరిస్థితి నెలకుంది. సంఘటన పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు వెతకడం మొదలు పెట్టారు. ఐతే ఎట్టికేలకు విద్యార్థి మధ్యాహ్నం సమయంకు ఇంటికి చేరుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

## గ్లోబల్ ఇన్‌వెస్ట్‌మెంట్ సమ్మిట్‌తో పెట్టుబడుల వరద : ఎమ్మెల్సీ భరత్



**కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త :** విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్లోబల్ ఇన్‌వెస్ట్‌మెంట్ సమ్మిట్ 2023 సదస్సు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడుల వరద మొదలు కానుందని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ సదస్సుకు ఎమ్మెల్సీ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామమన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో రాష్ట్రంలో దాదాపు 13లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఎంఒయులు కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక పరంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తొలిరోజే రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ వంటి దిగ్గజాలు ఎపిలో తాము పెట్టుబడులు పెడతామని ముందుకు రావడం హర్షణీయమన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఈ గ్లోబల్ సమ్మిట్ నిరూపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేశం అభ్యర్థిని గెలిపించండి

చిత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తరపున పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దేశం నాయకులు చిత్తూరు మండలం పాలూరు, దిగువమాసపల్లి, ఆనగల్లు, పచ్చనపల్లి, కుర్చివేడు గ్రామపంచాయతీలతో ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు సూచికలనీ, మొదటి ప్రాధాన్యత ఓటును రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టిడిపి అభ్యర్థికి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు మోహన్‌రాజ్, మేషక్, శోభన్‌బాబు, రఘు, కుమార్, కందస్వామి, యోగమూర్తి, వరప్రసాద్, చల్ల, కరుణాకరణ్, రవి, రెడ్డెప్ప, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీబచ్చుల మృతి పార్టీకి తీరని లోటు

చిత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాలలు వేసి దేశం నాయకులు ఘననివాళులర్పించారు. ఆయన తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలను అందించారనీ, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌లతో పాటు దేశం నాయకులు పాల్గొన్నారు.

## లోకేష్ బాబూ రూ.10లక్షలు ఎప్పుడిస్తావు!

కల్లూరు, మార్చి 3 ప్రభాతవార్త :

కల్లూరు వైకాపా మైనారిటీ నాయకులు మహమ్మదాలి అలియాస్ అలీభాయ్ శుక్రవారం మాట్లాడుతూ గతంలో లోకేష్ కల్లూరుకు వచ్చినపుడు జామియామసీదు (పెద్దమసీదు)కు రూ.10లక్షలు ఇస్తానని వాగ్దానం చేశారు అన్నారు. ఆవాగ్దానం పూర్తి చేయలేని నీవు తెలుగుదేశం పార్టీ తరపున కల్లూరులో మైనారిటీ సదస్సు ఎలా పెడతారని ప్రశ్నించారు. ప్రజలు ఆయన మాటలను విశ్వసించవద్దని కోరారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

బంగారుపాళ్యం, మార్చి 3 ప్రభాతవార్త:



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. మండల పరిధిలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటింగ్ కోసం పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 2,210 పట్టభద్రుల ఓటింగ్ కోసం రెండు పోలింగ్ కేంద్రాలు, 145 ఉపాధ్యాయుల ఓటింగ్ కోసం ఒక పోలింగ్ బూత్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ విద్యుత్, మంచినీటి సరఫరా, వెలుతురు తప్పక కల్పించడానికి ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలింగ్ సిబ్బందికి మరుగుదొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, తహసిల్దారుబెన్నురాజ్, డిప్యూటీతహసిల్దారు ఇబ్రహీం, హెడ్మాస్టర్ రాజేంద్ర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 6న మండలమీట్

పాలసముద్రం, మార్చి 3 ప్రభాతవార్త:

పాలసముద్రం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ విద్యావతి ఓ ప్రకటనలో తెలిపారు. మండల సమస్యలను చర్చించి పరిష్కరించడానికి నిర్వహించే ఈ సమావేశానికి జడ్పీటిసీ, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయిఅధికారులుహాజరుకావాలనిఆమె కోరారు.

## కంచర్ల శ్రీకాకంత్ గెలుపుకు కృషి

గుడిపాల, మార్చి 3 ప్రభాతవార్త:

పట్టభద్రుల తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపుకు కృషి చేయాలని తెలుగుదేశం నాయకులు కోరారు. కంచర్ల శ్రీకాంత్‌కు మద్దతుగా శుక్రవారం మండల తెలుగుదేశం నాయకులు నారగల్లు, ఎఎల్‌పురం, వెంగమాంబపురం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటుటు కంచర్ల శ్రీకాంత్‌కు వేయాలని మండల దేశం అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పట్టభద్రులను కోరారు. శాసనమండలిలో నిరుద్యోగుల సమస్యలను ప్రస్తావించే గళం ఒక్క కంచర్ల శ్రీకాంత్‌కే వుందని ఈ విషయంను అర్థం చేసుకొని ఆయనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు రాజగోపాల్‌నాయుడు, సుబ్బానాయుడు, కోమల రఘుపతి, మురారి, జయదేవనాయుడు, బాలాజీ, హరిదాస్, దామోదర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి.. ఆర్థికసాయం



**కుప్పంరూరల్, మార్చి 3 ప్రభాతవార్త :** మండలంలోని పైపాళ్యం పంచాయతీకి చెందిన గంగప్ప కుమారుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్త వెళ్లప్ప మృతి చెందాడు. దీంతో అతని అంత్యక్రియలను తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక నేతలు పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లెప్ప, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి, పార్టీ అధ్యక్షుడు గోవిందస్వామి, భరణి, తొట్లమణి, దేవరాజ్, సురేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అందరు సమన్వయంతో పని చేయాలి : పెద్దిరెడ్డి

సోమల, మార్చి 3 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన గృహసారథులు సచివాలయాల కన్వీనర్లు వారికి కేటాయించిన ఏరియాలలో సమన్వయంతో పని చేయాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం సోమలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలుతీసుకు వెళ్లి ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిది అన్నారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజక వర్గ వైకాపా కన్వీనరు జింకా వెంకటాచలపతి, ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ అమాసమోహన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ అరుణ, మాజీ చైర్మెన్ నాగేశ్వరరావు, సచివాలయల, గృహసారథుల మండల కన్వీనర్ మధు, ప్రభాకర , ఖాదర్‌భాషా, ఎంపీటీసీలు, సర్పంచిలు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

## అమృత్ సరోవర్ పనులను పరిశీలించిన పిడి



భాకరాపేట,మార్చి 3 ప్రభాతవార్త :

చిన్నగొట్టిగల్లు మండలంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న అమృత్ సరోవర్ పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. జంగపండ్లపల్లె పంచాయతీ మారసాని హరి జనవాడ వద్ద కుంటను పరిశీలించారు. తర్వాత చిన్నగొట్టిగల్లు పంచాయతీ చిట్టివాండ్లపల్లె చెరువును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఏపీఓ మృత్యుంజయరావు, జేఈ రెడ్డెప్ప, టెక్నికల అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బిసి ఐక్య సంఘర్షణ సమితి జాతీయ కార్యదర్శిగా షణ్ముగం

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:

జాతీయ బిసీ సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శిగా షణ్ముగం నియమితులయ్యారు. హైదరాబాద్ అబీడ్స్‌లోని బిసి ఐక్య సంఘర్షణ సమితి జాతీయ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు విజిఆర్ నారగోని బీసీ సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శిగా షణ్ముగంను నియమిస్తూ నియామక పత్రంను అందజేశారు. తనపై నమ్మకంతో జాతీయ బీసీ సంఘర్షణ సమితీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ కార్యవర్గ సభ్యులకు షణ్ముగం కృతజ్ఞతలు తెలిపారు.



## జిఎంసి బాలయోగిని నివాళులు

**చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:** లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత జిఎంసి బలయోగి 21వ వర్థంతిని పురస్కరించు కొని శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, దేశం నాయకులు సిఎంటి త్యాగరాజ్, కార్పొరేటర్ ఇరువారం అశోక్, నాయకులు కృష్ణమూర్తి, ప్రభుతేజ, శోబన్‌బాబు, నిత్యానంద్, భూషణం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనతోనే జ్వరాలకు అడ్డుకట్ట

యాదమరి, మార్చి 3 ప్రభాతవార్త:



దోమలను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తేనే జ్వరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ అన్నారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని దాసరాపల్లి సబ్ సెంటర్ పరిధిలో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు గృహాల వద్ద నిల్వ వుంచిన నీటి డ్రమ్ములను ఆయన పరిశీలించి నీటికి పారబోశారు. ప్రతివారం నిల్వ వున్న నీటిని పారబోసి ఒక రోజు డ్రమ్ములను ఎండబెట్టి కొత్త నీటిని నింపుకోవాలని ఆయన సూచించారు. నీటి నిల్వ వుంటే దోమలు పెరిగి ప్రాణాంతకమైన డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర జ్వరాలు వస్తాయన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీపతి, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్త భువనేశ్వరి తదితరులు

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బిజెపి నాయకురాలి పాడె మోసిన వాకాటి

సూళ్లూరుపేట, మార్చి 3 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు గ్రామంలో నివసిస్తున్న భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు ఇరుగా నాగలక్ష్మి గురువారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందారు. శుక్రవారం ఆమె అంత్యక్రియల్లో భాగంగా ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి పాల్గొని ఆమె పార్థివదేహానికి ఘనంగా నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆమె పాడెను స్వయంగా మోశారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, తన్నీరు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబాలా బ్రహ్మానంద సరస్వతిచే ప్రవచనాలు

సూళ్లూరుపేట, మార్చి 3 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీబాలబ్రహ్మానంద సరస్వతిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారం నిర్వహించారు. నైమిశారణ్య పీఠాధిపతులు అయిన బ్రహ్మానంద సరస్వతి హిందూ ధార్మికత గురించి అమ్మణ్ణి మహత్యాలను వివరిస్తూ శ్రీజగన్మాతదేవి తత్వం గురించి ప్రవచనాలు చేశారు. స్వామివారు చేసిన ప్రవచనాలను భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంతో పరవశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

## పక్షుల కేంద్రాన్ని సందర్శించిన ఎఫ్‌ఆర్‌ఓఎస్ అధికారులు

దొరవారిసత్రం, మార్చి 3 ప్రభాతవార్త :



దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల వన్యసంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ట్రైనీ ఫారెస్ట్ సెక్షన్ రేంజర్ ఆఫీసర్లు సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన 55 మంది ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓఎస్‌లు నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న పక్షులను, వన్య ప్రాణులను తిలకించారు. అనంతరం వీరికి సూళ్లూరుపేట డిఎఫ్‌ఓ శామ్యూల్, రేంజర్ వరప్రసాద్ దగ్గరుండి పలు సూచనలు, సలహాలిచ్చారు.

## ఉపాధి పనులను తనిఖీ చేసిన ఎంపిడిఓ

దొరవారిసత్రం, మార్చి 3 ప్రభాతవార్త :



దొరవారిసత్రం మండలం ఏకొల్లు, వేణుంబాక గ్రామాల్లో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఎంపిడిఓ శింగయ్య ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏకొల్లు, వేణుంబాక గ్రామాల్లో అమృత సరోవర్ చెరువు నిర్మాణ పనులను ఎంపిడిఓ తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ఉపాధి కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న రోజువారీ వేనం రూ.257కు తగ్గకుండా తగిన కొలతలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఎంపిడిఓ సూచించారు. అనంతరం అక్కడికక్కడే మస్టర్లను, హాజరు పట్టికను ఏర్పాటు చేయాలని తెలిపారు.

## తడలో బిజెపి ఎంఎల్‌సి అభ్యర్థి ప్రచారం



**తడ, మార్చి 3 ప్రభాతవార్త :** తడ మండలంలో శుక్రవారం తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి బిజెపి అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. తడలోని తహశీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయంతో పాటు పోలీసు స్టేషన్, బ్యాంకులు, సచివాలయాల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దయాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## టిడిపి అభ్యర్థి విజయం కోసం వేనాటి ప్రచారం

తడ, మార్చి 3 ప్రభాతవార్త :



తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో తిరుపతి జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఆయన తడలోని వివిధ ప్రాంతాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కంచర్ల శ్రీకాంత్ విజయం కోసం మండలంలోని పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా చెప్పారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆయన ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును కంచర్ల శ్రీకాంత్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే తడలో పలుచోట్ల కంచర్ల విజయం కోరుతూ గోడపత్రికల ద్వారా పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

## చంద్రబాబును కలిసిన కోట టిడిపి నాయకుడు తూపిలి

కోట, మార్చి 3 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కోటకు చెందిన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి కలిశారు. రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ నందమూరి తారకరత్న పెద్దకర్మ సందర్భంగా ఫిలింనగర్ కల్చరల్ హాలులో జరిగిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణతో కలిసి నందమూరి తారకరత్నకు నివాళి అర్పించినట్లు తెలిపారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు : ఎంపిడిఓ

కోట, మార్చి 3 ప్రభాతవార్త :

మేజర్ పంచాయతీ కోటలోని ఆకుతోటదిబ్బ ప్రాంతంలో ఉన్న గ్రంథాలయ స్థలాన్ని కొందరు ఆక్రమించారని తిరుపతి జిల్లా ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కోట ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఎంఇఓ వెంకటసునీల్‌కుమార్ ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఎవరూ ఆక్రమణలకు పాల్పడలేదని ఎంపిడిఓ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ భవాని హెచ్చరించారు.

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

గూడూరు, మార్చి 3 ప్రభాతవార్త :



గూడూరు రెండోపట్టణ పరిధిలోని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారంలో భాగంగా శుక్రవారం న్యాయవాదులను, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందిని, విద్యుత్ శాఖ ఏఇ కార్యాలయం సిబ్బందిని, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డిని, ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కి రెడ్డి బాబు రెడ్డికి తమ యొక్క మొదటి అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కరపత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, ఎస్. సురేష్, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బచ్చల అర్జునుడు మృతికి సంతాపం

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బచ్చల అర్జునుడు మృతికి జిల్లా తెలుగుదేశం నాయకులు సంతాపం తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ బచ్చల అర్జునుడు చిత్రపటానికి తెలుగుదేశం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బచ్చల అర్జునుడు మృతికి నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర దేశం నాయకులు వెంకిటీల సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు వున్నారు.

## స్ట్రాంగ్ రూములను పరిశీలించిన గూడూరు ఆర్డీవో



గూడూరు, మార్చి , ప్రభాతవార్త :

పట్టణంలోని జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్రాంగ్ రూంలోని బ్యాలెట్ బాక్స్‌లను గురువారం గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ పరిశీలించారు. మార్చి 13వ తేదిన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వినియోగించనున్న బ్యాలెట్ బాక్స్‌లను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గూడూరు పట్టణ, మండలం, చిల్లకూరు, వాకాడు, కోట, చిట్టమూరు, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మొత్తం ఎనిమిది మండలాలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు తనిఖీ చేశారు. సిబ్బందికి బ్యాలెట్ బాక్స్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దార్ లీలారాణి, చిల్లకూరు, తహశీల్దార్ స్వర్ణ, కోట ఎమ్మార్వో పద్మావతి, రూట్ ఆఫీసర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకులు శ్యామన్నను గెలిపించుకుందాం

కోట, మార్చి 3 ప్రభాతవార్త :



తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైకాపా అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం వైకాపా మైనారిటీ సంఘం నాయకులు షేక్ మోబిన్ భాషా పిలుపునిచ్చారు. శుక్రవారం కోటలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోబిన్ భాషా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి వున్న, సమాజ సేవ పట్ల మక్కువను పెంచుకుని మూడు దశాబ్దాల పైగా ఎనెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మధ్యలో ఉంటున్న శ్యాం ప్రసాద్ రెడ్డిని పెద్దల సభకు పంపాలని సూచించారు. పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి కరోనా సమయంలో వేలాది మందికి నిత్యవసరాలను సరఫరా చేసి ఆదుకున్నారని గుర్తు చేసారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన లక్ష్మీ నరసింహ ఆలయ నిర్మాణ పనులు

వెదురుకుప్పం,మార్చి 3 ప్రభాతవార్త :



అహోబిల లక్ష్మీ నరసింహ ఆలయ నిర్మాణ పనులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. మండలంలోని కొండకిందపల్లె గ్రామంలో నూతనంగా నిర్మాణ పనులు చేపట్టిన అహోబిల లక్ష్మీ నరసింహ ఆలయ నిర్మాణ పనులను ఉదయం 8 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణ ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రయుక్తంగా శుభలగ్నమందు పునాదుల పై మూలరాయిని ప్రతిష్టాపన చేయడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయలన నిర్వహకులు కొండా రెడ్డి, కృష్ణా రెడ్డి, గోపాల్ రెడ్డి, దేవరాజుల రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రాజా రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి : ఎంపీపీ



**వెదురుకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త :** అభివృద్దే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎంపీపీ బండి నాగరాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఆరవ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు మండల ప్రజలకు అందుబాటులో ఉండి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటం వలన శాఖల వారిగా సమీక్ష నిర్వహించకనే సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఎంపిడివో సుధాకర్‌రావు, తహశీల్దార్ పుల్లా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రవక్త ఆచరించిన ప్రార్థనా విధానాలను అనుసరించాలి

-హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్



**శ్రీకాళహస్తి,మార్చి 3 ప్రభాతవార్త :** పండగల ప్రాధాన్యతను తెలుసుకోవాలని అల్లాహ్ ఆదేశాల మేరకు ప్రవక్త ఆచరించిన విధానాలను ఆచరించి భగవదనుగ్రహాన్ని పొందాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ వివరించారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో జరిగిన ప్రార్థనల సందర్భంగా ఆయన పలు అంశాలను ఆచరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఒక సారి మనిషి చనిపోయిన తరువాత అతని ఆత్మ మళ్ళీ వస్తుందనే భ్రమను విడనాడాలన్నారు. మంచిపనులు చేస్తే స్వర్గస్థుడౌతాడని పాపపు పనులు చేస్తే యమభటుల శిక్షలను అనుభిస్తుంటుండాని వివరించారు. అంతేకాని షాబాన్ మాసం 14వ రోజు రాత్రికి ఆత్మ వస్తుందని భావించటం సరికాదన్నారు. అంతేకాక షాబాన్ మాసం అంతా ప్రవక్త ఉపవాసదీక్షలు పాటించే వారని ఖచ్చితంగా ఫలాన 15రోజే ఆచరించాలనే నిబంధనలు ఎక్కడా లేదన్నారు. కొందరు సంప్రదాయాల ముసుగులో తప్పుదారి పట్టిస్తున్నారని అల్లాహ్ ఆదేశాల మేరకు ఆయనకు నచ్చినట్లు వ్యవహరించాలని అలాగే అల్లాహ్ ఆదేశాలను ఆచరించి మనకు మార్గదర్శకులైన ప్రవక్త మార్గాలను ఆచరించి ముక్తి పొందాలన్నారు.

**షబ్బేబరాత్ రోజు ఏం చేయాలి?**

షాబాన్ మాసం 15 రోజు రాత్రి భక్తి శ్రద్దలతో ఏకాగ్రతతో ప్రవక్త అల్లాహ్‌నుధ్యానం చేస్తూ గడిపారని అలాగే మనం కూడా ఆచరించాలన్నారు. ఏకాగ్రతతో రాత్రంతా ధ్యానం చేస్తూ, జపం చేస్తూ గడపాలన్నారు. మనం తెలిసి తెలియక చేసిన పాపాలను క్షమించమని వేడుకోవాలి తప్ప రాత్రంతా గడపటం లైట్లు పగలగొట్టడం టీలు కాఫీలు తాగుతూ జాగరణ అని చేయటం ఏ పుస్తకంలోనూ లేదన్నారు. మనం నిత్యం పరమత మత్తులో ఉంటూ వారి ఆచారాలను ఆచరిస్తూ 'మనం ప్రార్థనలు చేస్తున్నాము. అనుకుంటాము'కానీ అది సరైన విధానం కాదని తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నమాజులు ఆచరించాల్సిన విధి విధానాలు ఆచరించకూడని అంశాలను వివరిస్తూ మసీదులో 'తప్పని సరిగా డ్రెస్‌కోడ్'ను ఆచరించాలని టి షర్టులతో దయచేసి మసీదులకు వచ్చి తన ప్రార్థనలనే కాకుండా చూసిన ప్రతి ఒక్కరి పాపాలను మూటకట్టుకోవదని సూచించారు.

## వైకాపాలోకి వలసల జోరు!



**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపాను బలోపేతం చేసుకొని తిరుగులేని శక్తిగా ఎదటానికి ప్రతిపక్షాలు లేని నియోజకవర్గంగా రూపుదిద్దుకొనుటకు నాయకులు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే తటస్థులు, తెలుగుదేశం పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు. శుక్రవారం ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ నాగంపల్లి గ్రామానికి చెందిన పలువురు వైకాపా పార్టీలో చేరారు. సుమారు 30 సంవత్సరాలుగా వారు తెలుగుదేశం మద్దతుదారులుగా ఉన్నారు. వారు శుక్రవారం పార్టీ కార్యాలయంలో వైకాపా కండువాను వేసుకున్నారు. సీనియర్ నాయకులు బండారుపల్లి మునిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తొండమనాటి మునిరెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దమునిరెడ్డి వీరి అనుచరులు సుమారు 30 మందితో బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈకార్యక్రమాల్లో ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, నచ్చనేరి పంచాయితి సర్పంచ్ డి.మునిరామిరెడ్డి, వైస్ ఎంపిపి శ్రీనివాసులు యాదవ్, మండల నాయకులు అయితే పల్లి గురునాథం, పవన్, సిద్దయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించండి : బొజ్జల

**శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త :** తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి



తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశంపార్టీ శ్రీకాళహస్తి నియోజకర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శాసనమండలి ఎన్నికలపై తెలుగుదేశంపార్టీ శ్రేణులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన శాసనమండలి ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో తెలుగుదేశంపార్టీ నేతలు, కార్యకర్తలు 11వ తేదీ వరకు తమ తమ పరిధిలోని పట్టభద్రులను కలసి శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని కోరారు. ప్రతి కార్యకర్త ఈఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఓటు వేసే విధంగా చైతన్యపరచాలన్నారు. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. తమ పరిధిలోని పట్టభద్రుల ఇండ్లకు వెళ్ళి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిని ఎందుకు గెలిపించాలో ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశంపార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, శాసనమండలి అబ్జర్వర్ ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతి నాయుడు, దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్య నాయుడు, ప్రకాష్‌నాయుడు, నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి), మహిళా నాయకురాలు కృష్ణవేణి, రేణుకాదేవి, కుమారి, సునీమా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ పోరాట ఫలితమే దయనేడుకు ఆర్టీసి బస్సు!

**తొట్టంబేడు, మార్చి 3 ప్రభాతవార్త :** జనసేన పార్టీపోరాట ఫలితమే మండలంలోని దయనేడు గ్రామానికి ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని కల్పించిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుతకోట తెలిపారు. ఈసందృంగా ఆమె మాట్లాడుతూ దయనేడు గ్రామంలో తాము ఇంటింటికి పర్యటించినపుడు ఆగ్రామంలోని ప్రజలు ప్రధాన సమస్య వారి గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక రైతుకు, విద్యార్థులు, మహిళలు పలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంఎల్ఏ దృష్టికి తీసుకుకి వెళ్ళినా సమస్య పరిష్కరించలేదని తెలపడంతో సమస్యను ఆర్టీసి అధికారులకు తెలపగా వారి గ్రామానికి రోడ్డు గుంతలమయం అయినందున బస్సు పంపడం లేదని తెలిపారు. దీంతో ఈసమస్యను జిల్లా కలెక్టర్, మండల అధికారులకు రోడ్డు సమస్యను తెలిపినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తమ సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించి ఆర్టీసి అధికారులకు పలుమార్లు సంప్రదించి ఒత్తిడి తేవడంతో చివరికి గురువారం నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ తెలిపినట్లు వివరించఆరు. ఈ గ్రామంలో వారికి మాట ఇచ్చినట్లు బస్సు తెప్పించి గ్రామంలో బస్సులోనే వస్తానని మాట ఇచ్చిన మేరకు ఉదయం 8గం.లకు దయనేడు గ్రామానికి బస్సులో వెళ్ళారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండిరాఘవయ్య, నాయకులు రవికుమార్‌రెడ్డి,జనసైనికులు కాటేష్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 20న కాలం చెల్లిన పోలీసు వాహనాలు వేలం

**చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పోలీసు విభాగానికి చెందిన కాలం చెల్లిన 56 పోలీసు వాహనాలను 16 లాట్లుగా విభజించి మార్చి 20వ తేదీ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఆన్‌లైన్‌లో జరిగే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేయాల్సివుంటుంది. వాహనాల వేలంలలో పాల్గొనదలచిన వారు 94910 74516, 94415 28862 నెంబర్లను సంప్రదించాలని జిల్లా పోలీసు కార్యాలయం తెలిపింది.

## రేపటినుంచి శ్రీ తిమ్మరాయస్వామి బ్రహ్మోత్సవాలు

**కుప్పంరూరల్, మార్చి 3 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తిండ్లు గ్రామంలో వెలసిన శ్రీ తిమ్మరాయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5వతేదినుంచి జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. 5న అంకురార్పణం, ధ్వజారోహణం, పూలగంప, రాత్రి ఉత్సవం, 6న ప్రాకారోత్సవం, అన్నదానం, కళ్యాణోత్సవం, 7న రథోత్సవం, అన్నదానం, ధూళి ఉత్సవం, 8న దోపోత్సవం, 12న పుష్పపల్లకి, నాటకం, 13న వసంతోత్సవం, అన్నదానం, శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం.. నాలుగు లక్షల మేర నష్టం



**శాంతిపురం, మార్చి 3 ప్రభాతవార్త :** మండలంలోని బోయనపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం ఓ ఇంటికి నిప్పంటుకోవడంతో ఇల్లు దగ్ధమై సుమారు నాలుగు లక్షల మేర నష్టం కలిగింది. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన ముని వెంకటప్ప ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో మంటలు చెలరేగాయి. అయితే మంటలు ఆర్పే యత్నం చేయగా విద్యుత్ షాక్ కొట్టడంతో ఇంట్లోని అందరూ బయటకు పరుగులు తీశారు. విషయాన్ని అగ్నిమాపక అధికారులకు తెలపగా వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని టివి, బీరువా, ఫ్రిడ్జ్, చేపల వలలు, లక్ష రూపాయల నగదు, దుస్తులు, నిత్యావసర సరుకులు అన్నీ కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

## బాలయోగి..బచ్చల అర్జునుడికి దేశం నేతల నివాళులు



**శాంతిపురం, మార్చి 3 ప్రభాతవార్త :** దివంగత పార్లమెంట్ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి వర్థంతి సందర్భంగా శాంతిపురంలో తెదేపా నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే అనారోగ్యంతో మృతి చెందిన ఎమ్మెల్సీ బచ్చల అర్జునుడు మృతికి సంతాపం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వీరి చిత్రపటాలకు పూజలు చేశారు. ఈసందర్భంగా వారు పార్టీకి చేసిన సేవల గురించి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కొనియాడారు. కాగా కుప్పంలో ఆర్టీసీ బస్సులు నడపడం లేదని అడిగిన విద్యార్థులపై తీవ్రస్థాయిలో ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడడం సరికాదన్నారు. కార్య క్రమంలో నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, రమేష్, శంకర్, అనసూయ, చంద్రకళ, శ్యామల పాల్గొన్నారు.

## పాఠశాలలో ప్రత్యక్షమైన పాము!

**రామకుప్పం, మార్చి 3 ప్రభాతవార్త :** స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం ఓ పాము ప్రత్యక్షమై కలకలం రేకెత్తించింది. ఉదయం పాఠశాలకు హాజరైన విద్యార్థిని శౌర్యశ్రీ తన తరగతి గదిలో నేలపై ఉన్న పుస్తకాలు పక్కన పెట్టే యత్నం చేయగా పాము చేతికి చిక్కింది. దీంతో బాలిక భయపడి పామును దూరంగా విసిరేసింది. ఇది గమనించిన బాలికలు పరుగులు తీశారు. పామును గుర్తించిన మరో విద్యార్థిని తండ్రి తరగతి గది బయట ఉన్న పామును పట్టుకుని దూరంగా వదిలేశాడు. దీంతో బాలికలు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల గ్రామానికి దూరంగా ఉండడంతో పాటు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

## సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి గెలుపుకు పట్టభద్రులు సహకరించండి

**కేవీబీపురం, మార్చి 3 ప్రభాతవార్త:** తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు ప్రకాశం జిల్లాల భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పి.ఎం.శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేవీబీ పురం మండలంలోని కాళంగి, కండ్లూరు, గుంటిపేడు, అంజూరు గ్రామాల్లోని ప్రతి పట్టభద్రులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటును సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి వేయాలని కోరారు. ఈ సందర్భంగా శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ ఆంధ్ర, రాష్ట్రంలోని పట్టభద్రులందరూ కుటుంబ పార్టీలైన వైసీపీ, తెలుగుదేశం పార్టీలకు స్వస్తి పలికి సామాన్య కుటుంబంలో జన్మించి ఉద్యమ నాయకుడిగా ఎదిగిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి పట్టభద్రులందరూ మీ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యత ఓటును భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మెంబరు వెంకటయ్య, మండల కార్యదర్శి వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

**కేవీబీ పురం, మార్చి 3 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలోని సదాశివపురం, కోవనూరు, తొట్టంబేడు మండలం చిట్టత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రితో పాటు, విజయ సాధన పుస్తకాలను శ్రీసాయిరాం మినీ సూపర్ మార్కెట్ ఓనర్లు మురళి, తేజ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా తేజ యాదవ్ మాట్లాడుతూ పేదరికం విద్యార్థుల చదువులకు అడ్డు రాకూడదన్న ఉద్దేశంతోనే 89 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అయిన పెన్నులు, పెన్సిలు, జామెట్రీ బాక్సు, ఫ్యాడ్‌తో పాటు విజయ సాధన పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్ బాబు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు నాగరాజు, షణ్ముగం, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు అడిగళార్ అవతార దినోత్సవం

**నగరి, మార్చి 3 ప్రభాతవార్త:** మేల్ మరువత్తూరు ఆధిపరాశక్తి పీఠం ఆధ్యాత్మిక గురువులు బంగారు అడిగళార్ 83వ అవతార దినోత్సవం, ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ఉద్యమ ప్రధాన కార్యదర్శి శక్తి ఏపి అగత్తియన్‌ల జన్మదినంను స్థానిక ఓంశక్తి భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి వి.టి.భాస్కరన్ ఆధ్వర్యంలో నగరి శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలోని రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, భోజనం ప్యాకెట్లు, చీరలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో గోపాల్, ఉద్యమ సేవకులు గోవిందస్వామి, ఎం.కమలాకర్, జి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైడే పాటించండి రోగాల నుంచి బయటపడండి



**నగరి, మార్చి 3 ప్రభాతవార్త:** డ్రైడే పాటించండి రోగాల నుంచి బయటపడండి అంటూ మండలంలోని మిట్టపాళెం సచివాలయ పరిధిలో బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పుత్తూరు సబ్ యూనిట్ అధికారి జి.మోహన్‌బాబు మాట్లాడుతూ ఇంటిలో నీటి పాత్రలను కడిగి ఎండపెట్టి డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రవీంద్ర, పర్యవేక్షకులు బి.బాబు, ఆరోగ్య కార్యకర్తలు, కళ, రవిచంద్రన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయి



**రేణిగుంట, మార్చి 3 ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు శరీరాన్ని అనారోగ్య పాలు చేయడమే కాకుండా జీవితాలను నాశనం చేస్తాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అధికారులు తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అడిషనల్ ఎస్పీ రాజేంద్ర ఆదేశాల మేరకు సీఐ ఫణీంద్ర, ఎస్ఐ భాస్కర్, హెడ్‌కానిస్టేబుల్ రవి మత్తు పదార్థాల సేవించడం వల్ల కలిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ దుర అలవాట్లకు ఆకర్షితులవ్వడానికి బాల్య దశ కీలకమన్నారు. ముఖ్యంగా కౌమార దశలో ఉన్న వాళ్ళు దుర అలవాట్లను నేర్చుకుంటారన్నారు. మత్తు పదార్థాల అక్రమ వ్యాపారాలు, రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో సెబ్‌కానిస్టేబుళ్లు మహేష్, చిరంజీవి, ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞానం, ఆధ్యాత్మికం పరస్పర అనుసంధానాలు



**రేణిగుంట, మార్చి 3 ప్రభాతవార్త:** విజ్ఞానం, ఆధ్యాత్మికం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.నాధమునిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐక్యూ ఏసీ, ఇస్కాన్ యూత్ ఫోరం శ్రేయస్ సంయుక్తంగా ఏకాగ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. సి.నాధమునిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన ఆధ్యాత్మికల పరస్పర అనుసంధానంపై చక్కగా వివరించారు. గౌరంగ దర్శన్ దాస్ఏకాగ్రత ఎలా సాధించాలో, మనస్సు విగ్రహ కోసం భగవద్గీత శ్లోకాల ఆవశ్యకతను బోధించారు. అనంతరం ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా. కె.రమ్య వందన సమర్పణ చేశారు. విద్యాసంస్థల చైర్మన్ గంగిరెడ్డి, విభాగాధిపతులు, ఫ్యాకల్టీలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాచార హక్కుల వేదిక నూతన కార్యవర్గం

**పుత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త :** సమాచార హక్కుల వేదిక నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన సంస్థ సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.బాబు, ప్రధాన కార్యదర్శిగా కె.మురగారెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.దొరస్వామి, ఉపాధ్యక్షురాలిగా జె.శుభ, కోశాధికారిగా కె.హేమలతను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా పది మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మురగారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## పుష్పరథంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి

**పుత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవారు పుష్పరథంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలో ఏర్పాటు చేసిన కలిశాలకు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అలాగే ఆలయంలోని వచ్చే విగ్రహాలకు కూడా అభిషేకాలు చేశారు. రాత్రి వైభవంగా మంగళవాయిద్యాలు నడుమ స్వామివారిని అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయ దాతలుగా పుత్తూరు జెండామాను వీధిలో నివాసం ఉన్న ముత్యాల గిరిధర్ ముత్యాల తేజ శ్రీనివాస్ సన్ ఆఫ్ ఎం.హరి,సుమిత్రరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారం పర్య ధర్మకర్త ఎం.సుందరం, దేవస్థానం అర్చకులు, ఎస్.రవిచంద్రన్ గురుకుల్, శరవణ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. శ్రీ వల్లిదేవసన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక హోమాలు, మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు అలాగే ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం, రాత్రి అశ్వ వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ బోర్డుపై అవగాహన సదస్సు : డీఈవో

**పుత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:** పుత్తూరు ఫైర్ స్టేషన్ సమీపంలో జరిగిన ఐఎఫ్‌పీ బోర్డుపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి డీఈవో శేఖర్, పుత్తూరు డీవైవో రఘురామయ్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెంగల్రాజు, పుత్తూరు ఎంఈవో తిరుమలరాజు, ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరపత్రాలు అందజేసిన ఉపాధ్యాయులు

**పుత్తూరురూరల్, మార్చి 3 ప్రభాతవార్త:** పుత్తూరు మండలంలో గేటు పుత్తూరు, 5,6,7,8,9 వార్డుల్లో జిల్లా పరిషత్ హైస్కూళ్ళ, ఎలిమెంటరీ హైస్కూళ్లు, తమిళ ఎలిమెంటరీ స్కూలు, మండల పరిషత్ హైస్కూలు, వివేకానంద హైస్కూలు, తమిళ మీడియం హైస్కూలు ఉపాధ్యాయులు గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కలసి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పుత్తూరు మండల అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబరు శంకర్, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు రామచంద్రరాజు, పుత్తూరు మండలం ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి మునస్వామి, సీనియర్ నాయకుడు శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ సహాయం

**తిరుపతి కార్పొరేషన్, మార్చి 3 ప్రభాతవార్త :** తిరుపతిలోని భవాని నగర్ నందలి నగరపాలక ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి పేద విద్యార్థులకు వంటకు ఉపయోగించే ప్రెజర్ కుక్కర్, నోటు బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్, బిస్కెట్లను వితరణ చేసారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో పేద విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే కాపీ రైటింగ్ బుక్స్, అంగన్‌వాడి పిల్లలకు ప్రజర్ కుక్కర్ వితరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. తరువాత చాకోలెట్స్, బిస్కెట్లను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ సెవెన్ హిల్స్ కార్యదర్శి వి. జగన్నాధం, బెల్లంకొండ సురేష్, రోహిత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరాజులు నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేనంబర్ 364లో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలా? వద్దా?

**శ్రీకాళహస్తి,మార్చి 3 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్ నగర్ పరిసరాల్లో సర్వే నెంబర్ 364లో వివాదాస్పదమైన స్థలాల్లో విద్యుత్ శాఖ ఎలాంటి కనెక్షన్లు ఇవ్వ వచ్చా లేదా వివరణ ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. మార్చి 2న ఉత్తర్వులుజారి చేసినట్లు విద్యుత్‌శాఖ పేర్కొనింది. సర్వే నెంబర్ 364లోని 114 పట్టాలులో ఇందిరమ్మ హౌసింగ్ స్కీంలో వివాదాలుచోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వే నంబర్‌లో నాయిబ్రాహ్మణ కాలనీ టైలర్స్ కాలనీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడి వాస్తవ పరిస్థితిని విద్యుత్ శాఖకు తెలపాలని విద్యుత్ శాఖ ఎఇఇ తహశీల్దార్‌ను కోరారు.

# తిరుపతి డివిజన్

## బై పాస్ రోడ్డులో అండర్ పాస్‌ల ఏర్పాటుకు కేంద్రమంత్రి సుముఖత

-బిజెపి చంద్రగిరి ఇన్‌చార్జి పురుషోత్తం నాయుడు

**తిరుపతిరూరల్, మార్చి 3 ప్రభాతవార్త:** తిరుపతి 150 బైపాస్ రోడ్డులో అవిలాల జంక్షన్, సి.మల్లవరం జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అండర్ పాస్‌లు ఏర్పాటు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సుముఖత చూపారని చంద్రగిరి నియోజకవర్గం బిజెపి ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు తెలిపారు. అవిలాల, వేదాంతపురం జంక్షన్, సి.మల్లవరం జంక్షన్స్‌ను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి అండర్ పాస్‌లలు ఏర్పాటుకు సంబంధిత అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాల జారీ చేసారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వేదాంతపురం జంక్షన్ వద్ద బిజెపి శ్రేణులు కలిసి ఆనందం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో ఆయా జంక్షన్స్ వద్ద ట్రాఫిక్ అంతరాయంతో పాటు ప్రమాదాలు జరుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్న, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న ఎవ్వరు పట్టించుకోలేదని వాపోయారు. ప్రజలు ఇబ్బందులను గుర్తించి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ అధ్యక్షుడు విజయ్, మహిళా మోర్చ నాయకురాలు లక్ష్మమ్మ, జనార్ధన్ చౌదరి, శ్రీధర్, శంకర్‌రెడ్డి, చక్రధర్, శివశంకర్‌రెడ్డి, ఈశ్వర్, గోఫినాథ్‌రెడ్డి, శివ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లే అవుట్‌ల భూ పరిహారం

- లెవలింగ్ బిల్లుల చెల్లింపులు పూర్తి చేయండి -కలెక్టర్ వెంకట రమణారెడ్డి



**తిరుపతిరూరల్, మార్చి 3 ప్రభాతవార్త:** లబ్దిదారుల గృహ నిర్మాణాల లే అవుట్‌లకు సంబంధించి భూ సేకరణ పరిహారంతో పాటు, చదును చేపట్టిన పెండింగ్ బిల్లుల చెల్లింపులు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీతో కలిసి హౌసింగ్, తిరుపతి, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారులతో, తహశీల్దార్స్‌తో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు లే అవుట్స్‌లో గతంలో చేపట్టిన లెవలింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా త్వరగా చెల్లించాలని సూచించారు. జిల్లాలో గృహ నిర్మాణాలకు చేపట్టిన భూ సేకరణ బిల్లులు కూడా మరోమారు పరిశీలించి, చెల్లింపులకు చర్యలు చేపట్టాలన్నారు. పాగాలి, శ్రీనివాసపురం, అగరాల, చిందేపల్లి, దుర్గసముద్రం, నీర్పాకోట లే ఔట్లపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సంయుక్తంగా సత్వర చర్యలు చేపట్టి చెల్లింపులు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, తిరుపతి, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారులు కనకనరసారెడ్డి, రామారావు, హౌసింగ్ పి.డి వేంకటేశ్వర్లు, హౌసింగ్ ఇంజనీర్లు, తహశీల్దార్స్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి జరగాలి : మేయర్ శిరీష



**తిరుమల,మార్చి 3 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ప్రజలకు అంతా మంచి జరగాలని, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తిరుమలేశుని వేడుకున్నట్లు తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష తెలిపారు. శుక్రవారం ఉదయం ఆమె కుటుంబంతో కలసి విఐపి దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి,వేదాశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే టిడిపి నేత బిటెక్ రవి కూడా వెంకన్నను దర్శించుకున్నారు.

## మంత్రి పెద్దిరెడ్డికి బిషప్ కౌన్సిల్ సాదర స్వాగతం



**తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 3 ప్రభాతవార్త:** శుక్రవారం విశాఖలో ప్రారంభమయిన గ్లోబల్ ఇన్వెస్టిమెంట్స్ సమ్మిట్‌కు హాజరయిన రాష్ట్ర అటవీ,విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సిఎం నారాయణస్వామిలను ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బాలరాజు,బిషప్ జాషువా,బిషప్ శామ్యూల్,బిషప్ జయసూర్యలు పుష్పగుచ్చాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,రైల్వే కోడూరు శాసన సభ్యుడు కొరుముట్ల శ్రీనివాసులు,ఎమ్మెల్సీ భరత్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థించే పెదవులకన్నా... సాయమందించే చేతులు మిన్న



**తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 3 ప్రభాతవార్త:** ప్రార్థించే పెదవులకన్నా సాయమందించే చేతులు మిన్న అని లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక భవానీనగర్‌లోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, కాపీ రైటింగ్ బుక్స్,అలాగే అంగన్వాడీ స్కూల్‌కు వంటకు ఉపయోగపడేందుకు ప్రెషర్ కుక్కర్,పిల్లలకు చాక్లెట్లు,బిస్కెట్లు లయన్స్ క్లబ్ తరపున అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్,లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ కార్యదర్శి వి.జగన్నాథం,బెల్లంకొండసురేష్,రోహిత్,పాఠశాలప్రధానోపాధ్యాయుడుదేవరాజులునాయుడు పాల్గొన్నారు.

## పట్టభద్రుల దొంగ ఓట్లను తొలగించాలి

-తొలగించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

-సిపిఎం,సిపిఐ,కాంగ్రెస్ నేతల డిమాండ్



**తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 3 ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు నమోదులో డిగ్రీ అర్హత లేకపోయినా అధికారుల అండతో దొంగ ఓట్లను చేర్పించిన ఘటన తిరుపతిలో చోటుచేసుకుందని సిపిఎం,సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు,పి.మురళి,కాంగ్రెస్ పిసిసి కార్యదర్శి యార్లపల్లి గోపిలు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో దొంగ ఓట్లను తొలగించాలని,సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం,సిపిఐ,కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో ప్రతి డివిజన్లో 300 ఓట్లు పదోతరగతి,ఇంటర్మీడియట్,ఆఖరికి చదువురాని వారికి కూడా పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం దొంగ ఓట్లు చేర్పించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం నాయకులు కందారపు మురళి, సుబ్రహ్మణ్యం, జయచంద్ర, మాధవ్, వేణు, బుజ్జి, శ్రీనివాసులు, మల్లికార్జునరావు, సిపిఐ నాయకులు విశ్వనాథ్,చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు

## వినాయకస్వామి మహా కుంభాభిషేకంలో భానుప్రకాష్



**నగరి, మార్చి 3 ప్రభాతవార్త:** నగరి మున్సిపాలిటీ సత్రవాడలో దేశ వినాయకస్వామి ఆలయ జీర్ణోద్ధారణ అష్ట బంధన మహా కుంభాభిషేక మహోత్సవంలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయనిర్వాహకులుఆలయప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కి ఓటు వేసి గెలిపించాలి



**నగరి, మార్చి 3 ప్రభాతవార్త** తూర్పు రాయలసీమ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నగరి టీడీపీ నాయకులు కోరారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నగరి మండలంలోని ఇంటింటికి వెళ్లి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్య రహస్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : ప్రిన్సిపాల్

**నగరి, మార్చి 3 ప్రభాతవార్త:** ఆరోగ్యమే మహాభాగ్యం అనేది భారతీయ నానుడి అని కావున ప్రతి విద్యార్థి ఆరోగ్య సూత్రాలు, ఆరోగ్య రహస్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ తెలియజేశారు. ప్రిన్సిపాల్ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తంలో హీమోగ్లోబిన్ శాతం పురుషుల్లో 14-18(జీఎం, డీఎల్) ఉండాలని మహిళల్లో 12-16(జీఎం, డీఎల్) ఉండాలని అంతకంటే తక్కువైతే క్రమంగా అనీమియాకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. అరుణకుమారి, డా. వేణుగోపాల్, భాస్కర్‌రాజు, షర్మిల, మీనాక్షి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటుతో మద్దతు పలకండి

**నగరి, మార్చి 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ పార్టీకి ఓటు ద్వారా మద్దతు పలకాలని మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పట్టభద్రులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, ఆర్‌బీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర పంటలతో అధిక లాభం

**విజయపురం, మార్చి 3 ప్రభాతవార్త :** వ్యవసాయంలో అంతర పంటలతో అధిక లాభం పొందవచ్చని మండలంలోని పలువురు రైతులు నిరూపిస్తున్నారు. కొబ్బరి, జామ తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ రైతులు లాభాలు పొందుతున్నారు. మండలంలో మిట్ట ప్రాంతాలు, కొండలకు భూములు ఆనుకుని వుండడం వల్ల ఎక్కువ మంది రైతులు మామిడి, కొబ్బరి పంటలను సాగు చేస్తున్నారు. కొబ్బరి, మామిడి తోటల్లో అంతర పంటలుగా కంది, పెసర, ఉద్ది, నువ్వులు సాగు చేసి ఒక ఎకరాకు పది నుంచి రూ. 12,000 వేల వరకూ అధిక ఆదాయం పొందుతున్నారు. అంతర పంటల వల్ల అధిక ఆదాయంతో పాటు వున్న పంటకఉ చీడ, పీడల బాధ తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

## ముత్యాల రెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

-మారుమూల నివాస ప్రాంతాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలి
-జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి

**తిరుపతి క్రైం, మార్చి 3 ప్రభాతవార్త :**



వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి వెస్ట్ సబ్ డివిజన్ ముత్యాల రెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి ఎస్‌హెచ్‌ఓ, పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క పనితీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నందు పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకి సరైన న్యాయం చేసే, సైబర్ నేరాల పట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతినపూర్తి చేయాలని మహిళా సంబంధిత నేరాల పట్ల వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా హైవే రహదారులు ఉన్నందున నిరంతరం వాహనాల తనిఖీలను నిర్వహించి , ఎర్రచందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాన్ని అరికడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యేక కార్యచరణ చేపట్టి, ప్రమాదకరమైన మలుపులు రోడ్ క్రాసింగ్‌లను గుర్తించి అక్కడ సూచిన బోర్డులను, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా అరికట్టి, అలాగే హైవే పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం రహదారి నందు తిరుగుతూ నేరాలు జరగకుండా నివారించాలన్నారు. స్టేషన్ పరిధిలో గల కేడీలు, బీసీలు పాత నేరస్తులు అనుమానితుల కదలికలపై ప్రత్యేకమైన నిఘా ఉంచుతూ తిరుపతి నగర విస్తరణ ఎక్కువగా ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరుగుతున్నందున దొంగతనాలు, దోపిడిలు వంటి నేరాలు నివారణ చేయుటకు ఒక ప్రణాళిక ప్రకారం పోలీస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరుని సమీక్షించిన పిదప వారితో మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళ సంబంధిత విషయాలను, బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం వంటి విషయాల గురించి సంబంధిత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యవంతులను చేసి, పాఠశాలలో బాలికల పట్ల ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుని ఏదేని అనుకోని సంఘటనలు జరిగి ఉంటే ఎస్‌హెచ్‌ఓకి తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వెస్ట్ డీఎస్పి నరసప్ప,సిఐలుసురేంద్రరెడ్డి, ఎంఆర్‌పల్లి, చంద్రశేఖర్ పిళ్ళై, డిసిఆర్‌బి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో పర్యటించనున్న డాక్టర్ సమీర్ శర్మ

-సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్షించనున్న ఛీప్ ఎగ్జిక్యుటివ్ -కలెక్టర్ వెంకట రమణారెడ్డి

**తిరుపతిరూరల్, మార్చి3 ప్రభాతవార్త:**



సి.యం.ఓ చీఫ్ ఎగ్జిక్యుటివ్ డాక్టర్ సమీర్‌శర్మ జిల్లాలో రెండురోజులు పర్యటించనున్నారని కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రగతి, ప్లాస్టిక్ నిషేదం, ఇ-వేస్ట్, బ్యాటరీ డిస్పోజల్ వంటివాటిపై జిల్లా అధికారులతో డాక్టర్ సమీర్ శర్మ సమీక్ష నిర్వహించనున్నారని, సంబంధిత శాఖల అధికారులు నివేదికలు సిద్దం చేయాలని కలెక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు, వాటిపై నివేదికలు సిద్దం చేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్లాస్టిక్ ఇ-వేస్ట్, బ్యాటరీ వ్యర్థాలుపై చేపడుతున్న కార్యక్రమాల నివేదిక కూడా సిద్దం చేయాలని సూచించారు. డాక్టర్ సమీర్ శర్మ శనివారం తిరుపతికి చేరుకుని అధికారులతో సమీక్ష నిర్వహించి, అనంతరం తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తారని, ఆదివారం శ్రీవారి దర్శనాంతరం తిరుగుప్రయాణం అవుతారని పేర్కొన్నారు. ఈసమీక్షలో జిల్లా ప్రణాళికాధికారి అశోక్‌కుమార్, డిఎల్‌డిఒ సుశీలాదేవి, ఐడిసిడిఎస్ పిడి జయలక్ష్మీ, డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డి.ఇ.ఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పట్టభద్రుల అభ్యర్ధిని గెలిపించండి

**తొట్టంబేడు, మార్చి 3 ప్రభాతవార్త :**



ఎంఎల్‌సి ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సిపి పట్టభద్రుల ఎన్నికల ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నియోజకవర్గ ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి ఆదేశాలతో తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్రారెడ్డి సూచనలతో శుక్రవారం చిన్నసింగమాల గ్రామంలోని మహిమాన్వితంగా వెలసిన వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్న సింగమాల, పెద్దసింగమాల, గాబచేను గ్రామాల్లో వైఎస్‌ఆర్‌సిపి ఎంఎల్‌సి మండల ఇన్‌ఛార్జులు కరపత్రాలను పంపిణీచేస్తూ ప్రచారం సాగించారు. కార్యక్రమంలో జెసిసి మండల కన్వీనర్ భక్తవత్సలం,మండల ఎంఎల్‌సి ఇన్‌ఛార్జి వెంగళరావు, సచివాలయ కన్వీనర్లు పూడినరసింహనాయుడు, భాస్కర్‌రెడ్డి, చంద్రబాబు, సాయిబాబా నాయుడు, నరసింహ, మోహన్‌రఘురాం, దీపక్, నాగరాజు, సునీత,వెంకటరామిరెడ్డి, అశోక్, ప్రేమ్‌కుమార్, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడుగా చంద్ర

**తొట్టంబేడు, మార్చి 3 ప్రభాతవార్త :**



అఖిలభారత దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి గ్రామానికి చెందిన గంధం చంద్రశేఖర్‌ను నియమించారు. ఈసంద్భంగా రాష్ట్ర స్థాయి సమావేశం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కూకట్లపల్లి ప్రసాద్జి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకుంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

## తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

**శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త :**

ఈనెల పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో నుంచి తిరువణ్ణామలై క్షేత్రానికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6వ తేదీన బస్సు ఉదయం 5గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1గంటకు చేరుతుందని అదేవిధంగా 6వతేదీన రాత్రి 10.30గంటలకు తిరువణ్ణామలై నుంచి బయలుదేరి శ్రీకాళహస్తికి ఉదయం 5గంటలకు చేరుకుంటుందన్నారు. భక్తులుకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. టిక్కెట్ ఒక్కరికి రూ.350లు మాత్రమే ఉందన్నారు. వివరాలకు 7382880178, 7382880239, 7382881715 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ఉద్యమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్ధిని గెలిపించండి

**తొట్టంబేడు మార్చి 3, ప్రభాతవార్త :**



ఈనెల 13వ తేదీన జరిగే తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ ఉద్యమ అభ్యర్థులనే గెలిపించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డిబాబురెడ్డి పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన శ్రీకాళహస్తిలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బాబురెడ్డి కలసి కరపత్రాలను పంపిణీచేశారు. అనంతరం బాబురెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈఏడాది జూలై 1నాటికి నూతన పిఆర్సీ అమలు చేయాల్సి ఉందని, అందుకు తగ్గట్టుగా పే రివిజన్ కమిటీని నియమించలేదని మండిపడ్డారు. సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలు హామీలను జగన్‌రెడ్డి ప్రభుత్వం తుంగలోతొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరిపుల్లయ్య, జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకుడు షరీఫ్, సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య, గంధంమణి, వెంకటేష్, కుమార్, సునీల్, నజీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో తెలుగుదేశంపార్టీ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 3 ప్రభాతవార్త**



ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ బలపరచిన అభ్యర్థి కంచర్లశ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలంటూ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పేడు పట్టణంలో పలువురిని వారి దుకాణాలు, కార్యాలయాల వద్ద వ్యక్తిగతంగా కలుస్తూ కరపత్రాలను పంపిణీచేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డివారిగురవారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనలో నిరంకుశవిధానాలును జగన్‌రెడ్డి పరిపాలనను శాసనమండలిలో ఎండగట్టడానికి తెలుగుదేశంపార్టీ బలపరచిన కంచర్లశ్రీకాంత్‌ను గెలిపించాలని కోరుతూ పట్టభద్రులకు కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, నిరంజన్, డి.నాగేశ్వరరావు యువత అధ్యక్షుడు బాలగురునాథ్‌యాదవ్, మండల బిసి అధ్యక్షులు మునెయ్య, పార్లమెంటు బిసి ఉపాధ్యక్షులు రాచేటిసుబ్రమణ్యం, పార్లమెంటు ఎస్సీ అధికార ప్రతినిధి రమణ, పార్టీ మండల కార్యదర్శిరమణయ్య, ఎస్పీమీడియా ప్రతినిధి గోపి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణి విశ్రాంతి గృహంలో గీజర్లు,లిఫ్టులు ప్లీజ్!

-వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో అనధికార హాకర్లు
-'డయల్ యువర్ ఇఒ'కు భక్తులు



**తిరుమల,మార్చి 3ప్రభాతవార్త ప్రతినిధి:** సామాన్య భక్తులకు వసతి కోసం నిర్మించిన కల్యాణి విశ్రాంతి భవనం గదుల్లో గీజర్లు,లిఫ్టులు ఏర్పాటు చేయాలని గుంతకల్‌నుంచి సుధాకర్ కోరారు. భక్తులకు కనీసం సదుపాయాలు లేవన్నారు. ఈ ప్రశ్నకు స్పందించిన ఇఒ ఏవి ధర్మారెడ్డి తిరుమలలో సామాన్యభక్తుల సౌకర్యార్థం 60ఏళ్ళ క్రిందట దీన్ని నిర్మించినవి, వాటిని తొలగించి కొత్తవాటిని నిర్మిస్తాము. పూర్తి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనకాపల్లి నుంచి త్రిమూర్తులు మాట్లాడుతూ వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలో అనధికారంగా హాకర్లు భక్తులకు కూల్‌డ్రింక్స్, తినుబండారాలు విక్రయిస్తున్నారు. భక్తులకు దీనివల్ల ఇబ్బంది గా మారిందన్నారు. దీనిపై సమాధానంగా అనధికార హాకర్లును అరెస్టుచేయడం జరిగిందని, ఇకపై ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. దేశం నలుమూలల నుంచి పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలు, సలహాలు, సూచనలపై ఇఒ ధర్మారెడ్డి సావధానంగా మాట్లాడారు. టిటిడికి సంబందించిన తిరుపతిలోని భూముల విషయంగా కొంత పొరబాటు జరిగిందని, సబ్‌నంబర్లను కోట్ చేయడంలో అలా చోటుచేసుకుంది. టిటిడి ఆస్తుల పరిరక్షణకు టిటిడి చర్యలు తీసుకుంటుందన్నారు. హైదరాబాద్ నుంచి మాలతి మాట్లాడుతూ అంగప్రదక్షిణ ఆఫ్‌లైన్‌లో జారీచేయాలని కోరారు. ఈ ప్రశ్నకు ఇఒ ధర్మారెడ్డి భక్తులు గంటలతరబడి తిరుమలలో టోకెన్లు కు వేచివుండకుండా ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ సదాభార్గవి, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్, ఎస్ఇ 2 జగదీశ్వరరెడ్డి, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, పిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒ భాస్కర్,వింగ్ విజిఒ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాధాలకు నిలయంగా స్వర్ణముఖినది వంతెన!

-పట్టించుకొని అధికారులు ....

**నాయుడుపేటరూరల్ మార్చి 3 ప్రభాతవార్త_;**

నాయుడుపేటకు కూతవేటు దూరంలో ఉన్న స్వర్ణముఖి నదిపై వంతెన ప్రమాధాలకు నిలయంగా మారుతున్న సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట-పండ్లూరు-వెంకటగిరికి ఈమార్గం గుండా వాహనాలు అధికసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి.ఆనాటి బ్రిటీష్ వారి కాలంలో స్వర్ణముఖినదిపై నిర్మించిన వంతెన శిధిలావస్థకు చేరుకొని కూలిపోయేందుకు సిద్దంగా ఉన్న ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌతున్నాయి. స్వర్ణముఖినది వంతెనపై సుమారు 15 గ్రామాల ప్రజలు ప్రతినిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. స్వర్ణముఖినదిపై నిర్మించిన వంతెన అక్కడక్కడ పగుళిచ్చి.పెద్దపెద్ద గోతులు ఏర్పడి కూలేందుకు సిద్దంగా ఉంది.ఈవంతెనపై ఏర్పడిన గుంటల వద్ద ఆటోలు, ద్విచక్ర వాహదారులు అదుపుతప్పి ప్రమాధాలు జరిగిన సంఘటనలు కూడ జరుగుతున్నాయి. ఈ వంతెనకు శాశ్వత మరామ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అదికారులకు తెలిపిన వారుమాత్రం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.ప్రమాద భరితంగా ఉన్న ఈస్వర్ణముఖనది వంతెనపై ప్రయాణం చేయాలంటే ప్రాణం గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తుందని ప్రయాణికులు చెప్పున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలేందుకు సిద్దంగా ఉన్న స్వర్ణముఖినది వెంతెనకు శాశ్వత మరామ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయికి శంకర్‌నాయక్ అభినందనలు



ఇటీవల స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యాశంకర్‌నాయక్ కలిశారు.పుష్పగుచ్ఛమిచ్చి అబినందనలుతెలిపారు.

## అమ్మవారి సేవలో దేవాదాయశాఖ కమిషనర్

**తిరుచానూరు,మార్చి 3 ప్రభాతవార్త:**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కుంకుమార్చన సేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.దర్శనాంతరం ఆశీర్వాదమండపం వద్ద అమ్మవారి శేషవస్త్రంతో పాటు తీర్థ ప్రసాదాలు అందచేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూధన్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో శిష్య స్వీకార మహోత్సవం

- సూరి గురుకుల్‌కు స్థానం

**శ్రీకాళహస్తి,మార్చి 3 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల అలంకారాల్లోనూ, అలాగే ఉత్సవాల సందర్భంగా కన్నుల పండువగా పంచమూర్తులను అలంకరిస్తూ జనం మెప్పు పొందిన అలంకార గురుకుల్స్ లో ఒకరైన సూరి గురుకుల్ అనే సురేష్ గురుకుల్ శివదీక్ష తీసుకున్నారు. అలాగే శ్రీజ్ఞాన ప్రసూనాంబికా దేవి సన్నిధానం సురేష్ గురుకుల్‌గా గుర్తింపు పొందిన ఆయన శివదీక్షతో పాటు శిష్యునిగా స్వీకరించుటకు మూడు రోజుల పాటు పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆదిశైవ శివాచార్యులకు గురుస్థానమైన వైదికాగము పీఠాధిపతులు, శివాచార్యులు తత్పురుష శివగురువు డాక్టర్ స్వామినాదన్ గురుకులు ఆశీర్వాదంతో కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకు పూజలు అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో సురేష్ దంపతులకు పునీత స్నానం చేయించారు.ఈకార్యక్రమాల్లో భరద్వాజ వంశ పరంపర స్థలపతులు, స్థానికులు, మిరాశిదారులైన డాక్టర్‌స్వామి నాధన్‌గురుకుల్, శాంతమ్మ శ్రీకాళహస్తీశ్వర గురుకుల్, కృష్ణమూర్తి గురుకుల్, పరశురాం గురుకుల్, ఆశీర్వాదాలతో కార్యక్రమాలను నిర్వహించారు. విశేషంగా హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సురేష్ దంపతులకు కలశలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన నీటితో ఆలయంలో స్నానమాచరింపజేసారు. పంచహారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరై బహుమతులిచ్చారు. ఆలయ ఉద్యోగులు,అర్చకులు వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

## కర్మక్రతువులను హేళన చేయవద్దు

**శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త :**



దివంగతులైన తమ ఆత్మీయులకు దశదినకర్మ నిర్వహించడం ద్వారా వారిని పంచభూతాల సాక్షిగా ప్రకృతిలో కలిపే కర్మక్రతువులను హేళన చేయడం భావ్యమా అని శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ మిన్నలరవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గోపాలవనంలో ప్రాంతంలో హిందువుల కర్మక్రియల మండపానికి సంబందించిన వివరాలు తెలియని స్థానికేతరులైన అధికారులు వాస్తవాలను వక్రీకరించి మాట్లాడడం మంచిదికాదని హితవు పలికారు. సరైన నిర్వహణ లేని కారణంగా అప్పటి కర్మక్రియల మండపంలో క్రతువులను నిర్వహించుకోవడం ఇబ్బందికరంగా ఉన్నదని గతంలో సర్వేయ చక్రపాణి మహాత్మాగాంధీ పంధాలో చేసిన అలుపెరగని పోరాటాన్ని అధికారులు గుర్తించుకోవాలని తెలిపారు.అప్పటికే ఉన్న కర్మక్రియల మండపంలో క్రతువులు నిర్వహించేటపుడు ప్రజలు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన కొందరు సామాజిక కార్యకర్తలు నది ఒడ్డున ఒగదిని నిర్మించి ఉపయోగంలో ఉంచారని తాత్కాలిక ఉపశమనం కోసమే అన్న విషయాన్ని పురపాలక సంఘ అధికారులు తెలుసుకోవాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ మరియు జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు హితవు పలికారు. గతంలో కర్మక్రియలు నిర్వహించేందుకు ఉపయోగించే భవనం ఎవరిది? దానిని తొలగించి నూతన భవన నిర్మాణానికి ఏశాఖ బాద్యతలు చేపట్టిందో తెలుసుకునే ప్రయత్నం చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఎవరికో లబ్దిచేకూర్చాలన్న అత్యుత్సాహంలో అధికారులు గత స్మృతులను చెరిపేయాలని ప్రయత్నించడాన్ని హిందూ సమాజం తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాసరం రమేష్, కిషోర్, సుబ్బయ్య, భాస్కర్, మణి, హేమంత్, సునీల్ తెలిపారు.

## లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరం

**తిరుపతినగరం, మార్చి 3 ప్రభాతవార్త**



లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యు.శ్రీహరి అన్నారు. బేటీ భచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణీ స్త్రీకు పుట్టబోయే ఆడబిడ్డ లేక మగబిడ్డ అని స్కానింగ్ పరీక్షలు ద్వారా తెలుసుకోవాలని ప్రయత్నం చేయడం నైతిక తప్పే కాకుండా చట్టరీత్యాకూడా నేరమని మనదేశంలో అధిక సంఖ్యలో బ్రూణహత్యలు జరగడం వల్ల 2021 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000మంది బాలురకు కేవలం 919మంది బాలికలు మాత్రమే ఉన్నారని ప్రకృతికి వ్యతిరేఖంగా ఉన్న బాలబాలికలకు లింగ నిష్పత్తిలోని తేడా వల్ల భవిష్యత్తులో తీవ్రపరిణామాలు ఉంటాయని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకునే ప్రయత్నం చేసిన ప్రోత్సహించిన వారికి 3 నుంచి 5సంవత్సరాలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారని తెలుపుతూ అవగాహనా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా వైద్య అధికారి కార్యాలయం నుంచి వైద్య సిబ్బంది మరియు ఆశావర్కర్లు, ఎఎన్ఎంలుతో పాటు డిఎంహెచ్ఓ డాక్టర్ అరుణసులోచన, డాక్టర్ శాంతకుమారి, పిడిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ హర్షవర్ధన్ మరియు కార్యక్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారుల పట్ల ప్రభుత్వాలకు చిన్న చూపు తగదు

-ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

**గూడూరు, మార్చి 3, ప్రభాతవార్త :**



చిరువ్యాపారుల పట్ల ప్రభుత్వాలకు చిన్నచూపు తగదని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి జిల్లా చిరువ్యాపారుల ప్రథమ మహాసభలలో ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణ ప్రభుత్వాలను హెచ్చరించారు. గూడూరు విశ్రాంతి ఉద్యోగుల భవనం నందు వీధి వ్యాపారుల తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిధులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. మురళి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రెడ్డికే రాధాకృష్ణ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం వీధి వ్యాపారులకు రక్షణ కొరకు ఏర్పాటు చేయబడ్డ చట్టం ఈ తిరుపతి జిల్లాలో ఎక్కడ కూడా అమలు జరగలేదని అన్నారు. వీధి వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ మున్సిపల్ అధికారులే తిరిగి వారిని ఇబ్బందులు పెడుతున్నారని తెలియజేసారు. వ్యాపారులకు అండగా చట్టాలు ఉన్నప్పటికీ ఆ చట్టాలు అధికారుల చుట్టాలుగా మారాయని హేళన చేశారు. వీధి వ్యాపారులకు మౌళిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలియచేసినప్పటికి ఇప్పటి వరకు ఎక్కడ ఏ విధంగా వారికి ఏర్పాటు చేశారో ఏ అధికారైన చెప్పగలరా అని ప్రశ్నించారు. వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గూడూరులో చిరువ్యాపారుల జిల్లా మహాసభలు నాంది పలకాలని కోరారు. ఈ మహా సభలలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి విప్లవ గేయాలు సబికులను ఉర్రూతలూగించాయి. అనంతరం మహాసభలో నూతన సమితి, కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర, వైఎస్ మణి, వై చంద్రయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశి, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్యామ్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, కోశాధికారి సరిత, ముని బాలాజీ, రాంమూర్తి, రమణ, గీతమ్మ, కాంచనమ్మ, తులసి, రూప, కెఆర్ జానకి, గుల్జార్బీ, శేఖర్, చందు, ప్రతాప్, హరి తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలి : సిపిఐ

**పుత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త :**



భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ నానాటికీ పెరిగింది తప్ప, తగ్గింది లేదని సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్ తెలిపారు. వంట గ్యాస్ ధరలు పెంపుపై శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో సిలిండర్లను తల మీద పెట్టుకుని మోస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో 410 రూపాయలున్న సిలిండర్ ధరను నేటికి రూ. 1150 పెంచిన ఘనత ప్రధాని నరేంద్రమోడికే దక్కుతుందన్నారు. పెట్రోలియం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గినప్పటికీ గ్యాస్ ధరలు మాత్రం తగ్గించడం లేదన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వంట గ్యాస్ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం మోపిందని విమర్శించారు. అదానీ లాంటి ధనికుల ఆస్తులకు బిజెపి కాపలాదారుగా మారిపోయిందని వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిజెపికి బుద్ది చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సెల్వరాజ్ ఆచ్చారి, రమేష్, రవి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలి

- జాయింట్ కలెక్టర్ డా॥ వెంకటేశ్వర్లు



**కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త :**ఈనెల 13న జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, ఎఆర్ఓ డా॥ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కుప్పం, రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటుచేస్తున్న 13 పోలింగ్ కేంద్రాలను జెసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు నీడ, నీటి సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎన్నికలకు 8, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఓటర్లకు ఈనెల 8వతేది లోగా ఓటరు స్లిప్పులను బిఎల్ఓలు లేదా విఆర్వోల ద్వారా పంపిణీ నేరుగా చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీని వాలంటీర్లకు అప్పగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న మండల కేంద్రాలకు సంబంధించి కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే తాత్కాలిక స్ట్రాంగ్‌రూంను సైతం సిద్ధం చేయాలని ఆదేశించారు. గుడుపల్లె జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ప్రహరీ గోడ లేకపోవడంతో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్లు దేవరాజ్, లోకేశ్వరరావు, కమీషనర్ రవిరెడ్డి, డిఇ హరినాథ్‌రెడ్డి, ఎంపిడిఓలు జానకమ్మ, హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

## రెండు చోట్ల ఎర్రచందనం సహా వివిధ వాహనాలు పట్టివేత

**రొంపిచెర్ల, మార్చి 3 ప్రభాతవార్త :**



పీలేరు సంచార నిఘా విభాగాధికారి పర్యవేక్షణలో శుక్రవారం రెండు చోట్ల దాడులు చేసి ఎర్రచందనం సహా వివిధ వాహనాలు పట్టుకున్నట్లు ఎన్.వెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈనెల 2వ తేదీ సాయంత్రం అన్నమయ్య జిల్లా పించా, సుండుపల్లె పరిసర ప్రాంతాల నుంచి చెన్నైకి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నదని సమాచారం అందింది. ఈమేరకు అదే రోజు రాత్రి సిబ్బందితో చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం పీలేరు నుంచి తలపుల రోడ్డు మల్లెల క్రాసు వద్ద కాపు కాచి ఉన్నారు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఒక ద్విచక్ర వాహనం,కారు ముందు వెనుక రావడం కనపడింది. వెంటనే అటవీ సిబ్బంది తమ వాహనంతో అడ్డుకున్నారు. వీరిని గమనించిన వాహనాలలోని చోదకులు ఇద్దరు వీరి వాహనాన్ని గుద్ది ఆపి కిందకు దిగి చీకట్లోకి పారిపోయారు. వారి కోసం వెతకగా కనపడలేదు. అనంతరం అక్కడ నిలిపి ఉంచిన టయోటా ఇన్నోవా కారును పరిశీలించగ 7 ఎర్రచందనం దుంగలు కనపడ్డాయి. వాటిని,వాహనాన్ని,ద్విచక్రవాహనం పల్సర్ బైక్‌ను స్వాదీనం చేసుకున్నారు. అదే విదంగా శుక్రవారం పూతలపట్టు మండలం తేనెపల్లె టోల్‌ప్లాజా వద్ద కాపు కాసిఉండగా అనుమానిత వాహనం వచ్చింది. దానిని సిబ్బంది ఆపగా అందులోని డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతన్ని పట్టుకున్నారు.మరో వ్యక్తి పారిపోయాడు. పట్టుపడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన కామరాజునటరాజన్‌గా గుర్తించారు. పారిపోయిన వ్యక్తి రామకృష్ణగా గుర్తించారు. ఆవాహనంలో మరో 8 ఎర్రచందనం దుంగలు కనపడ్డాయి. వాటిని వాహనం తో సహా స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసంఘటనలో ఎర్రచందనం, వాహనాలు కలిపి మొత్తం రూ.22లక్షలు ఉంటాయని చెప్పారు. ఈదాడులలో సంచార నిఘావిభాగంసిబ్బందిప్రతాప్, కుప్పుస్వామి ఎఫ్‌బీఓలు,స్ట్రైకింగ్ ఫోర్సు ప్రభుతేజ, చరణ్‌లు పాల్గొన్నారు.

## ధరలు తగ్గించకుంటే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి

**చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త:**



పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించకుంటే ప్రధాని మోడికి మహిళలే బుద్ధి చెప్తారని సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు హెచ్చరించారు. పెంచిన గ్యాస్ ధరలపై శుక్రవారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం, సిపిఐ, ఎస్ఎఫ్ఐ, ఎపి మహిళా సమైక్య ఆధ్వర్యంలో కార్యకర్తలు గ్యాస్ సిలెండర్‌ను చేతపట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సిపిఐ నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ 2014 సంవత్సరానికి ముందు గ్యాస్ సిలెండర్ ధర 414 రూపాయలు వుండగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 1,150 రూపాయలకు చేరిందని ధ్వజమెత్తారు. ప్రధాని మోడి అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధా అవకాశాలు, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనతరం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని దుయ్యపట్టారు. బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం గ్యాస్‌పై మాత్రమే 750 రూపాయలు పెంచిందని ధ్వజమెత్తారు. అలాగే వంట గ్యాస్‌పై సబ్సిడీని పూర్తిగా తొలగించి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం ఎనలేని భారంను మోపిందని విమర్శించారు. గ్యాస్ ధర తగ్గించే వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ప్రధాని మోడి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంటు ఛార్జీలను పెంచుతున్నప్పటికీ ప్రశ్నించే ధైర్యం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు గోపినాథ్, సురేంద్ర, సుబ్బారావు, పి.చైతన్య, విజయగౌరి, రమాదేవి, జమిలాబీ, కుమారి, కోమల, లత, మణి, శ్యామల, రఘు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చిపై విహరించిన పద్మావతి దేవి

**తిరుచానూరు,మార్చి 3 ప్రభాతవార్త:**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి అర్చకులు మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు.అనంతరం కళ్యాణోత్సవం వేడుకగా జరిగింది.మధ్యాహ్నం అమ్మవారి ఉద్యానవనంలో వేంచేసి వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై అధిరోహించి నాలుగు మాడవీధుల్లో భక్తులను కటాక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,సూపరింటెండెంట్లు మధుసూధన్,శేషగిరి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు ప్రసాద్,అశోక్,సుభాస్కర్, ఏవిఎస్ఓ శైలేంద్రబాబు,విఐ రామ్మోహన్,ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.